క్లుప్తంగా

ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి

వేంపల్లె : పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బాలబయన్న తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సంబంధిత గోడ పత్రాలను ఆయన విడుదల చేశారు. ఈనెల 25న ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని మండలస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవభారత సృష్టికర్త ప్రధాని మోదీ

వేంపల్లె : నవభారత సృష్టికర్త ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ కొనియాడారు. మంగళవారం ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

జోనల్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, డైరెక్టర్లు

వేంపల్లె : స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ క్రీడా మైదానంలో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఖోఖో అండర్–17 నలుగురు, అండర్–14 నలుగురు, కబడ్డీ అండర్–17 ఒకరు, అండర్–14 ఇద్దరు, వాలీబాల్ అండర్–17 ముగ్గురు, అండర్–14 విభాగాల్లో ముగ్గురు ఎంపికయ్యారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చక్రాయపేట : ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు నాల్గవ విడత ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. 10 తరగతి పాసై 40 సంవత్సరాల లోపు వయసు గల వారు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదంటే తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రము, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకొస్తే తమ కళాశాల వద్ద నుంచే ఆన్‌లైన్ చేస్తామన్నారు. ఈనెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు పూర్తి వివరాలకు తమకళాశాలలో సంప్రదించాలన్నారు.

20న చక్రాయపేట ఐటీఐలో జాబ్‌మేళా

చక్రాయపేట : ఈనెల 20న చక్రాయపేట ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. మంగళూరుకు చెందిన కాగ్నెంట్ ఈ సర్వీస్ లిమిటెడ్, కడపకు చెందిన ఏఐఎల్ డిక్సన్ కంపెనీ వారు నిర్వహించే జాబ్‌మేళాకు ఐటీఐ పాసై చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న వారు హాజరుకావచ్చునన్నారు.

ఆవాస్ గ్రామీణ గృహాలు ప్రారంభం

పులివెందుల రూరల్ : దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆవాస్ గ్రామీణ పట్టణ గృహ ప్రవేశాలను మంగళవారం హౌసింగ్ డీఈ రమణారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని నగరిగుట్టలో బీఎల్‌సీ పథకం కింద మంజూరైన ఇళ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కమలాపురం : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు. మైనర్లు ఆటోలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ముందుగా వెళ్తున్న వాహనాలను ఓవర్ టేక్ చేయరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని సూచించారు. ఆటోలు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

ఎర్రగుంట్ల : పట్టణంలో మట్కా స్లిప్పులను ఆన్‌లైన్‌లో పంపిస్తున్న నాదెండ్ల దస్తగిరి, వెంకటరాముడు నాయక్, విజయ్‌రామాంజనేయులును మంగళవారం పట్టుకుని వారినుంచి రూ. 3900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

597 మార్కులు వచ్చినా సీటు రాలేదు



ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా కింద మొదటి కౌన్సిలింగ్‌లో సీట్లు కేటాయించడం జరిగింది. కానీ 597 మార్కులు వచ్చినా నాకు సీటు రాలేదు. పులివెందులలో మెడికల్ కళాశాల ఉండి ఉంటే ఈజీగా నాకు సీటు వచ్చి ఉండేది. నాకు సీటు రాకపోవడం చాలా బాధ కలిగిస్తోంది. నీట్ పరీక్ష రాసి 597 మార్కులు సాధించినప్పటికి సీటు రాకపోవడం బాధ కలిగిస్తోంది.

– తేజ(ఎంబీబీఎస్ విద్యార్థి), పులివెందుల



తీవ్ర అన్యాయం చేసిన కూటమి ప్రభుత్వం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే నిరుపేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మధ్య తరగతి పేద ప్రజలు లక్షలాది రూపాయలు డబ్బులు చెల్లించి మెడికల్ కళాశాలలో చదవలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వం రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వ కళాశాలలో అయితే అన్ని వసతులు, సౌకర్యాలతోపాటు ప్రొఫెసర్లు ఉంటారు.

– రసూల్ (నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు), పులివెందుల

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో శ్రీరంగనాథస్వామి ఆలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారు చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సచివాలయ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కమలాపురం నగర పంచాయతీ చైర్మన్ మార్పురి మేరి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గ్రామ చావడి వరకు పారిశుద్ధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆమె జాకెట్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్లతో కలసి ఆమె రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లింగాల : లింగాలలో ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వర రావు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ, సచివాలయ, మెడికల్ సిబ్బంది స్వచ్ఛతా హి కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా స్వభావ్ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత అనే అంశంపై మంగళవారం ఎంపీడీఓ దివిజ సంపతి ఆధ్వర్యంలో సఫారి కర్మచారీలు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, నాయకులు, ప్రజలు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. స్థానిక రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పడ్డారు. అలాగే పలు వీధుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పులివెందులలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

తొండూరు : చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డు, బస్టాండ్ వద్ద స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం బస్టాఫ్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సాయి ప్రతాప్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మండల స్థాయి అధికారులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలో పాల్గొన్నారు.

వేముల : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. మంగళవారం మండలంలోని పెండ్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. బాలింతలు తల్లులు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగుంట్లలో వీధులు ఊడ్చుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యలు పారిశుద్ధ్య కార్మికులతో కలసి చీపుర్లు పట్టుకుని వీధులు ఊడ్చారు.

కొండాపురం : గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టేందుకు అధికారులతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ నాగప్రసాదు తెలిపారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

జమ్మలమడుగు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని బీజేపీ దళిత మోర్చా నాయకుడు మేకల ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఎస్సీకాలనీలోని రామాలయంలో స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టి పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు.

గంజాయి మత్తు వదిలితేనే ఉజ్వల భవిష్యత్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ×మాదక ద్రవ్యాల నివారణ మనందరి బాధ్యత× అనే కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను మున్సిపల్ కమిషనర్ రాముడు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు విడుదల చేసి మాట్లాడారు. యువత సరదాల కోసం మత్తు పదార్థాలకు అలవాటుపడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలు పెను ప్రమాదంగా మారిపోతున్నారన్నారు. తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకుని వచ్చి దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, మెప్మా సీఓ గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాముడు, తదితరులు

రైతు సేవా కేంద్రాల పరిశీలన

లింగాల : మండలంలోని పెద్దకుడాల, మురారిచింతల రైతు సేవా కేంద్రాలను పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మండల వ్యవసాయ అధికారి రమేష్‌తో కలిసి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయశాఖ ద్వారా అందుతున్న సేవలను అక్కడున్న రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులను, పంటలలో వచ్చే చీడ పీడలగురించి తెలియజేస్తూ.. రైతు సేవలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. పెద్దకూడాలలో జరుగుతున్న ఇ–కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో 6,228 మంది రైతులకు 20,500 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. అలాగే 5,562 మంది రైతులకు ఇ–కేవైసీ చేశామన్నారు. ఇ–కేవైసీకి ఈనెల 23వ తేదీ చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

వల్లూరు : మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో వైఎస్ ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ శ్రీధర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభమవుతుందన్నారు. ఏఓ సాయిజ్యోతి మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఇ–కేవైసీ చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలు మంజూరైన వెంటనే పంపిణీ చేస్తామన్నారు. విద్యుత్ శాఖ ఏఈ డానియల్ జోసెఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని అందిస్తోందన్నారు. ఆసక్తి వున్నవారు తమను సంప్రదించాలన్నారు. పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి కంప చెట్లు అల్లుకుపోతున్నాయని వాటిని తొలగించాలని గోటూరు ఎంపీటీసీ రామ కృష్ణారెడ్డి కోరారు. వల్లూరు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని వల్లూరు ఎంపీటీసీ సుబ్బరాయుడు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పవన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు చేపట్టాలి


లబ్ధిదారులతో కలసి ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : వారం కిత్రం పి.బొమ్మేపల్లి గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకులు జగనన్న కాలనీలోని ఇళ్లను జేసీబీతో పడగొట్టారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లులేని లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. అందులో కట్టుకున్న ఇళ్లను ఎన్‌డీఏ కూటమి నాయకులు కూల్చడం మంచిపద్ధతి కాదన్నారు. అధికారులు పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కిరెడ్డి హనుమంతురెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు పాచిరెడ్డి, గౌరీనాథ్‌రావు, యోబు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు

జమ్మలమడుగు : మండల పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వెంకటరమణారెడ్డి, చంద్రశేఖర్‌రావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు అని తెలిపారు. 19వ తేదీ యోగ, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు, 20న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 23న అథ్లెటిక్ పోటీలను పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తారన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ వివరాలను పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలో 18వ తేదీ సాయంత్రం లోపు నమోదు చేసుకోవాలన్నారు.

అధిక లోడుతో వెళ్తే చర్యలు

ముద్దనూరు : స్థానిక రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి ప్లేయాష్ అధికలోడుతో ప్రయాణించే వాహనాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లా రవాణాశాఖాధికారులు స్వలాభాపేక్ష కోసం లారీలకు, బల్కర్‌లు ఫ్లేయాష్, సిమెంటు అధికలోడుతో ప్రయాణిస్తున్నప్పటికీ తనిఖీ చేయడంలేదని ఆయన ఆరోపించారు.

ఉపాధి పనులు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనులు ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి ద్వారా చేపట్టాలని ఎఫ్ఈఎస్ జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనిమెల, గోనుమాకులపల్లె గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులపై మండలస్థాయి కమిటీ చర్చించడంతో పాటు ఉమ్మడి వనరుల అభివృద్ధి కమిటీ ద్వారా సాగు చేస్తున్న రైతుల భూముల్లో ఉపాధి పనులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం ఏపీఓ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఇ-పంట నమోదు చేసుకోండి

కమలాపురం : మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన తమ పంటలకు ఈనెల 23వ తేదీలోగా ఇ-పంట నమోదు, ఇ–కేవైసీ పూర్తి చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో చేసిన ఇ–పంట నమోదును, ఇ–కేవైసీని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈనెల 23వ తేదీ వరకు గడువు పెంచిందన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఇ–పంట డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల చేయడంతో పాటు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఏవైన అనుమానాలు ఉంటే గ్రామసభల్లో అర్జీలు ఇవ్వాలన్నారు.

నీట్ విద్యార్థులకు అన్యాయం చేయవద్దు

కమలాపురం : నీట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేయవద్దని, మెడికల్ సీట్ల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ సీట్ల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీట్లు భర్తీ చేయవద్దు అని ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణం అన్నారు.

ఎంబీబీఎస్ చేయాలనే పేద విద్యార్థుల కల కలగానే మిగిలిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పులివెందులకు కేటాయించిన 50 సీట్లను తాము నిర్వహించలేమని చెప్పడం వెనకబడిన రాయలసీమ ప్రాంత విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే విధానం ద్వారా ఎంబీబీఎస్ సీట్లు మరింత ఖరీదు అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఓ వైపు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు మెడికల్ కళాశాలలు, సీట్లు కావాలని కోరుతుంటే, మరో వైపు కూటమి ప్రభుత్వం తమకు మెడికల్ సీట్లు వద్దని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన మండి పడ్డారు.

గులాబీరంగు పురుగు ఉధృతిని తగ్గించుకోవాలి

జమ్మలమడుగు : రైతులు సాగుచేసిన పత్తి పంటకు ఎక్కువగా గులాబీ రంగు పురుగు సోకిందని దాని ఉధృతిని తగ్గించడానికి రైతులు నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలని కేవీకే వనిపెంట శాస్త్రవేత బాలకృష్ణ తెలిపారు. మండలంలో పొన్నతోట రైతులు సాగుచేసిన పత్తి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తొలి దశలో క్లోరిఫైరుపాస్, క్వినీన్‌పాస్ మందులను పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో కడప ఆత్మ అధికారి పద్మలత, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

పులివెందుల రూరల్ : పట్టణంలోని వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రెండవ రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సులు మాట్లాడుతూ జీవో 115ను వెంటనే రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే నిరసనలను ఉధృతం చేస్తామన్నారు.

వేరుశనగ పంటలో మెలకువలు పాటించాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగులో ఉన్న వేరుశనగ పంటలో మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వేరుశనగ పంటలో ప్రధానంగా తిక్కా ఆకుమచ్చ తెగులుకు గురైనట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ తెగులును రైతులు గుర్తించాలంటే ఆకులపై గుండ్రంగా మచ్చలు ఏర్పడి ఆకుపై భాగాన ముదురు గోదుమరంగు కలిగి ఉంటుందన్నారు. నివారణకు హెక్సా కొనజోల్ 400మి.లీ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు.

నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి


వేంపల్లెలో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న సీడీపీఓ సునీత


తొండూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఎంపీడీఓ


జమ్మలమడుగులో విద్యార్థినులకు నులిపురుగు మందును వేస్తున్న మున్సిపల్ కమిషనర్

వేంపల్లె : నులిపురుగుల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వి.సునీత తెలిపారు. మంగళవారం మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆమె అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. పిల్లలు మట్టిలో ఆడుకోవడం, భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోకుండా ఉండటం, చెప్పులు లేకుండా ఆరుబయట సంచరించడం, మల విసర్జనంతరం చేతుల శుభ్రత పాటించక పోవడం ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించి రక్తాన్ని పీల్చి, రక్త హీనతకు కారణమవుతాయన్నారు. వీటి నివారణకు అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఈమాత్రలను వేయించాలన్నారు. అలాగే అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రాణి, సూపర్వైజర్ అరుణాదేవి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏపీ మైనారిటీ గురుకుల పాఠశాల, మండలంలోని తాళ్లపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణపై అవగాహన నిర్వహించినట్లు పీహెచ్‌సీ హెచ్ఈ షఫివున్నీషా తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్టాఫ్ నర్సు,ఏఎన్ఎంలు నాగస్వర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్, పాల్‌టెక్నికల్, గురుకుల కళాశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి ఆల్బెండ జోల్ మాత్రలను విద్యార్థినులకు మింగించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి విజయ, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, ఐటీఐ కళాశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న ఏడాది నుండి 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు మంగళవారం ×జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం× సందర్భంగా మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, బాలికల ఉన్నతపాఠశాలలో మంగళవారం నులుపురుగు నివారణోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.శాంతికళ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌లు పాల్గొని విద్యార్థులకు నులుపురుగుల మందులను పంపిణీ చేసి మాట్లాడారు. పిల్లలకు 19 సంవత్సరాలు వచ్చేవరకు నులిపురుగు సమస్యలుంటాయన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి ఈ మందులను వేసుకోవాలన్నారు. నులిపుయగు సోకిన పిల్లలకు రక్తహీనత, కడుపు నొప్పి, వాంతులు, వీరేచనాలు, నీరసం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, పోషకలోపం లక్షణాలు ఉంటాయన్నారు.

అన్నదానం.. గొప్ప కార్యం

కమలాపురం : అన్న దానం.. మహా గొప్ప కార్యం.. అని స్థానిక పెద్ద దర్గా పీఠాధిపతి సోదరులు మౌలానా స్వామి తెలిపారు. కుమ్మర వీధిలో వెలసిన మద్రస ఏ షహమీరియా తాళీముల్ ఖురాన్ వద్ద నౌజవాన్ కమిటీ సభ్యులు, 16వ వార్డు కౌన్సిలర్ ఖాజా హుసేన్, ఫారుక్, అయుబ్, కెప్టెన్ బాబుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మిలాదున్నబి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ఫాతెహ చేసి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తాము 35ఏళ్ల నుంచి తమ ఆధ్వర్యంలోనే అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా నిర్వహిస్తున్నా మన్నారు.